కన్నుల పండువగా వేంకటేశ్వరుడి వార కల్యాణం



ఆలయంలో స్వామి వారి కల్యాణం జరిపిస్తున్న పూజారులు

చిలుపూర్, జనవరి 27: మండల కేంద్రంలోని చిలుపూర్ గుట్ట బుగులు వేంకటేశ్వర స్వామి దేవాలయంలో స్వామి వారి వార కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. శనివారం ఆలయ ప్రధాన అర్చకులు బ్రాహ్మణపల్లి రవీందర్ శర్మ, సౌమిత్రి రంగాచార్యుల వేదమంత్రోచ్చరణల మధ్య వేంకటేశ్వర స్వామి-పద్మావతి అమ్మవార్ల ఉత్సవ మూర్తులను పట్టు వస్త్రాలు, పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తుల సమక్షంలో కల్యాణం జరిపించారు. ఈ సందర్భంగా ప్రత్యేక రుసుము చెల్లించి కల్యాణంలో కూర్చున్న దంపతులకు స్వామి వారి శేష వస్త్రాలతో పాటు, తీర్థప్రసాదాలను అందజేశారు. హనుమకొండకు చెందిన పొడిశెట్టి విద్యాసాగర్-ప్రమీల దంపతుల సహకారంతో భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఈవో లక్ష్మీప్రసన్న, స్వామి వారి నిత్యసేవకులు, ఆలయ శాశ్వత దాత పొట్లపల్లి శ్రీధర్‌రావు-కిరణ్మయి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ చిర్ర నాగరాజు, సంగోజు మోహనాచారి-శంకరలక్ష్మి, గుళ్ళపల్లి భవాని-శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్ ఆడెపు రమేష్, రికార్డు అసిస్టెంట్ వీరన్న, విశాల్, గాదె రాజశేఖర్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జిల పాలన ఇంకెన్నాళ్లు...!?



కొడకండ్లలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం



కొడకండ్లలోని సబ్‌ట్రెజరీ కార్యాలయం

- మండల స్థాయి అధికారుల్లో అధికంగా వారే..
- సకాలంలో సేవలందక ప్రజల ఇబ్బందులు
- కొత్త ప్రభుత్వంలోనైనా పూర్తి స్థాయి నియామకాలు అయ్యేనా..?

కొడకండ్ల, జనవరి 27: జిల్లాలో గత ప్రభుత్వంలో వివిధ శాఖల్లో కొత్త నియామకాలు జరగలేదు. అధికారులకు పదోన్నతులు కూడా కల్పించలేదు. దీంతో మండల స్థాయిలో ఇన్‌చార్జిలతోనే పాలన కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పనులు సకాలంలో జరగక జాప్యమవుతోంది. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా కనీసం పదోన్నతులు కల్పించి ఆయా శాఖలకు పూర్తి స్థాయి అధికారులను నియమిస్తే తమకు మెరుగైన సేవలు అందుతాయని ప్రజలు అంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో కీలకమైన వ్యవసాయ శాఖలో మండల స్థాయిలో ఉండే అధికారి పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రస్తుతం కొడకండ్ల ఏవో పాలకుర్తి మండల బాధ్యతలు కూడా నిర్వర్తిస్తున్నారు. దీంతో ఏ మండలానికి ఎప్పుడు వస్తున్నారో అర్థం కావట్లేదని రైతులు వాపోతున్నారు.

ఉద్యాన శాఖ అధికారి పరిస్థితి మరీ అధ్వానం. పాలకుర్తి నియోజకవర్గంలోని కొడకండ్ల, పాలకుర్తి, దేవరుప్పుల, స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలోని స్టేషన్‌ఘన్‌పూర్, రఘునాథపల్లి, చిలుపూర్, లింగాలఘణపురం, జఫర్‌గడ్ మండలాలకు ఒక్కరే ఉద్యాన అధికారి ఉన్నారు. అంతకుముందు ప్రతీ మండలానికి సహాయకులుగా హార్టికల్చర్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్లను కాంట్రాక్ట్ పద్ధతిలో అప్పటి ప్రభుత్వం నియమించినా 2020 మార్చిలో వారిని తొలగించింది. దాంతో కూరగాయలు, వివిధ రకాల పండ్ల తోటలు పెట్టుకున్న రైతులకు ఏ సమస్య వచ్చినా ఉద్యాన అధికారిని కలవడం కష్టమవుతోంది.

ఇక అత్యంత కీలకమైన కొడకండ్లలోని రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయంలో పూర్తి స్థాయి సబ్ రిజిస్ట్రార్ బదిలీ అయి దాదాపు రెండేళ్లు కావస్తోంది. ఇప్పటికీ ఇంకో అధికారి భర్తీ కాలేదు. సీనియర్ అసిస్టెంట్ ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహించాల్సి వస్తోంది. అలాగే విద్యాశాఖలో పూర్తి స్థాయి మండల విద్యాశాఖ అధికారులు(ఎంఈవోలు) లేరు. జనగామ జిల్లా మొత్తానికి ఒక్కరే ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. దీంతో మండల నోడల్ ఆఫీసర్లే ఇన్‌చార్జి బాధ్యతలు చూస్తున్నారు. మండలంలో ప్రభుత్వ ఉద్యోగులకే గాక గ్రామ పంచాయతీలు, తదితర బిల్లులు ఇవ్వాల్సిన ట్రెజరీ శాఖలోనూ సిబ్బంది లేకపోవడంతో కొడకండ్ల ఇన్‌చార్జిగా జనగామ సబ్‌ట్రెజరీ ఆఫీసర్ కొనసాగుతున్నారు.

కొడకండ్లలో ఇన్‌చార్జి ఎంపీవోగా ఎంపీడీవో కార్యాలయంలోని సూపరింటెండెంటే అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. చైల్డ్ వెల్ఫేర్ శాఖలో కొడకండ్ల ప్రాజెక్ట్ సీడీపీవో జనగామ జిల్లా వెల్ఫేర్ ఆఫీసర్‌గా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఇలా అనేక ప్రభుత్వ శాఖల్లో ఇన్‌చార్జిలే ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొత్త ప్రభుత్వమైనా నూతన నియామకాలు జరపాలని, ఉన్న వారికి పదోన్నతులు కల్పించి పూర్తి స్థాయి మండల అధికారులను నియమించి పనులు సజావుగా జరిగేలా చూడాలని ప్రజలు, ఉద్యోగ సంఘ నాయకులు కోరుతున్నారు.



త్వరితగతిన పదోన్నతులు కల్పించాలి..

- దోరం ప్రభాకర్, ఉపాధ్యాయ సంఘం నేత, కొడకండ్ల

గత ప్రభుత్వం ఉద్యోగులకు పదోన్నతులు కల్పించకపోవడంతో పలు శాఖలు ఇన్‌చార్జిలతోనే కొనసాగుతున్నాయి. జిల్లా మొత్తంలో ఒక్కరే మండల విద్యాధికారి(ఎంఈవో) ఉన్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా కొత్త ప్రభుత్వం ఉన్న వారికి అర్హత ప్రకారం పదోన్నతులు కల్పించి తద్వారా ఏర్పడ్డ ఖాళీలను నియామకాలతో భర్తీ చేయాలి.



నూతన నియామకాలు చేపట్టాలి: ఎం.సోమన్న, బీజేపీ జిల్లా కార్యదర్శి, కొడకండ్ల

మండలంలోని ప్రభుత్వ శాఖల్లో సంవత్సరాలుగా పూర్తి స్థాయి మండల అధికారులు లేకపోవడం శోచనీయం. ఫలితంగా ప్రజలకు ప్రభుత్వ అధికారులు అందుబాటులో ఉండటం లేదు. దాంతో పనులలో తీవ్ర జాప్యం కలుగుతోంది. ఒకవైపు నిరుద్యోగులు నోటిఫికేషన్ల కోసం ఎదురుచూస్తున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఖాళీలను భర్తీ చేయాలి.

యురోపియన్ గడ్డమీద ఒగ్గుడోలు విన్యాసం

స్పెయిన్ వాసులను ఆకట్టుకున్న జానపద కళాప్రదర్శన



స్పెయిన్ ప్రతినిధులతో తెలంగాణ ఒగ్గు కళాకారులు

లింగాలఘణపురం, జనవరి 27 : తెలంగాణ జానపద కళ ఒగ్గుడోలు మోత యురోపియన్ గడ్డమీద ఉర్రూతలూగించింది. సాంస్కృతిక ప్రతీక.. సంప్రదాయపు గీతిక తెలంగాణ ఒగ్గుడోలు కళా విన్యాసాలు హద్దులు దాటి ఆకాశాన్ని హత్తుకున్నాయి. గ్రామీణ జానపద రంగంలో మేటిగా ప్రదర్శించే ఒగ్గుడోలు విన్యాసం ఇప్పుడు ఊళ్లను దాటుకుని విదేశాలను ఓలలాడించింది. యురోపియన్ గడ్డపై స్పెయిన్ మాడ్రిడ్‌లో ప్రతీ ఏటా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే ఎఫ్ఐటీయూఆర్-2024 ఇంటర్నేషనల్ టూరిజం ఫెస్టివల్‌కు తెలంగాణ పర్యాటక, సాంస్కృతిక శాఖ నుంచి ఒగ్గుడోలు విన్యాసం, భరతనాట్యం కళలు ఎంపికయ్యాయి. దీంతో జనవరి 24 నుంచి 28 వరకు ఇండియన్ ఎంబసీ ఆధ్వర్యంలో మాడ్రిడ్‌లో నిర్వహిస్తున్న ప్రత్యేక ఒగ్గు కళా ప్రదర్శన స్పెయిన్ వాసులను మంత్రముగ్ధులను చేసినట్లు లింగాలఘణపురం మండలంలోని మాణిక్యపురం గ్రామానికి చెందిన ఒగ్గుడోలు కళాకారుడు ఉస్తాద్ ఒగ్గురవి శనివారం తెలిపారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు ఇండియన్ ఎంబసీ అంబాసిడర్ దినేష్‌కుమార్ పట్నాయక్, తెలంగాణ పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరై అభినందించినట్లు రవి తెలిపారు.

నేడు పాలకుర్తికి మాజీ మంత్రుల రాక

పాలకుర్తి, జనవరి 27 : మండల కేంద్రంలోని బృందావన్ గార్డెన్‌లో ఆదివారం జరిగే నియోజకవర్గ స్థాయి బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి మాజీ మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతిరాథోడ్, ఎమ్మెల్యే కడియం శ్రీహరి హాజరవుతారని పార్టీ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ నాయకులు పని చేయడానికి దిశా నిర్దేశం చేస్తారని అన్నారు. అందుకోసం నియోజకవర్గంలోని బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలిరావాలని ఆయన కోరారు.

ఉత్తమ గ్రేడ్‌ల సాధనకు కృషి చేయాలి

జిల్లా విద్యాశాఖ ఏఎంవో శ్రీనివాస్

విద్యా కార్యక్రమాల అమలుపై సమీక్ష



కూనూరు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీలో ఏఎంవో శ్రీనివాస్, దాత లలిత్ యాదవ్, ఉపాధ్యాయులు

జఫర్‌గడ్, జనవరి 27 : త్వరలో జరగబోయే పదవ తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు అత్యుత్తమ గ్రేడ్‌లతో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ ఏఎంవో శ్రీనివాస్ సూచించారు. మండలంలోని కూనూరు జడ్పీ హైస్కూల్, ప్రాథమిక పాఠశాలల్లో వార్షిక పరీక్షలకు టెన్త్ విద్యార్థుల సన్నద్ధత, ఉన్నతి, లక్ష్య కార్యక్రమాలు, నో బ్యాగ్ డే, విద్యా బోధన, తదితర విద్యా కార్యక్రమాల అమలు తీరును శనివారం ఆయన పరిశీలించి ఉపాధ్యాయులతో సమీక్షించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రత్యేక తరగతులను నిర్వహిస్తూ.. ఆయా సబ్జెక్టుల్లో విద్యార్థుల సందేహాలను నివృత్తి చేయాలన్నారు.

విద్యార్థులు చదువే లక్ష్యంగా ముందుకు సాగుతూ ప్రతి ఒక్కరూ మంచి గ్రేడ్‌లతో ఉత్తీర్ణులవ్వాలని అన్నారు. పాఠశాలల్లో ప్రతీ నెల నాలుగవ శనివారం 'నో బ్యాగ్ డే' నిర్వహించి, విద్యార్థులకు క్రీడలు, సాంస్కృతిక అంశాలను నేర్పిస్తూ పరిశుభ్రత, ఆరోగ్య పరిరక్షణ వంటి అంశాలపై అవగాహన కల్పించాలని అన్నారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు ఉపాధ్యాయులు పాటుపడాలని ఆయన సూచించారు.

పీఎస్ విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీ

మండలంలోని కూనూరు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు దాత డాక్టర్ లలిత్ మోహన్ క్రీడా దుస్తులను బహూకరించారు. 1 నుంచి 5వ తరగతి బాలబాలికలకు రూ.40వేలు వెచ్చించి శనివారం విద్యాశాఖ ఏఎంవో శ్రీనివాస్, మండల నోడల్ అధికారి ఎండి.పర్వేజ్, హెచ్‌ఎం కె.సురేందర్‌రెడ్డిల సమక్షంలో ఆయన అందజేశారు. పేద పిల్లల విద్యాభివృద్ధికి చేయూత తనందించిన దాతను ఏఎంవో, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించి కృతజ్ఞతలు తెలిపారు.

మేడారం వస్తున్నా..

- 23న జాతరకు వచ్చి వనదేవతలను దర్శించుకుంటా..
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- రాష్ట్ర సచివాలయంలో మహాజాతర పోస్టర్ ఆవిష్కరణ
- సీఎంను సన్మానించిన పూజారులు



సీఎం రేవంత్ రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న మేడారం పూజారులు

ములుగు, జనవరి 27: మేడారం వనదేవతల మహాజాతరకు హాజరవుతానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఫిబ్రవరి 23న మేడారం వచ్చి సమ్మక్క, సారలమ్మలను దర్శించుకుంటానన్నారు. వనదేవతల వడ్డెలు(పూజారులు) సిద్ధబోయిన జగ్గారావు, కాక సారయ్య, కాక కిరణ్, చంద రఘుపతిరావు సీఎంను శనివారం కలిశారు. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కతో కలిసి సచివాలయంలో భేటీ అయ్యారు. దేవాదాయ శాఖమంత్రి కొండా సురేఖ, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, దేవాదాయ, గిరిజన సంక్షేమ శాఖ అధికారుల సమక్షంలో జాతర పోస్టర్‌ను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన్ను పూజారులు శాలువాతో సన్మానించారు. వనదేవతల పసుపు, కుంకుమ, ప్రసాదాన్ని అందజేశారు. జాతరకు రావాలని ఆహ్వానించారు. ఫిబ్రవరి 21 నుంచి 24వ తేదీ వరకు జాతర జరుగుతుండగా వనదేవతలంతా గద్దెలపై కొలువున్న 23న మొక్కుల రోజున మేడారం వచ్చి దర్శనం చేసుకుంటానని రేవంత్‌రెడ్డి వారికి తెలిపారు.

వారసత్వ వాటా సమస్యను తీర్చాలి..

మేడారం వడ్డెల(పూజారుల) సంఘం ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. అందులో పలు అంశాలను పేర్కొన్నారు. ప్రధానంగా వారసత్వ వాటా విషయంలో న్యాయ సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. దేశ అత్యున్నత న్యాయస్థానం తీర్పులు, హిందూ వారసత్వ చట్టాన్ని అనుసరించి పూజారుల కొడుకులకే వారసత్వ వాటా చెందేలా ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. పాలనా పరంగా మేడారం జాతర ప్రస్తుతం దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ పరిధిలో ఉందని, డిప్యూటీ కమిషనర్ స్థాయికి అప్‌గ్రేడ్ చేసి జాతర ప్రాంగణంలో శాశ్వత ఈవో కార్యాలయాన్ని నిర్మించాలని విజ్ఞప్తి చేశారు.

ధార్మిక భవనానికి సమ్మక్క, సారలమ్మ పేరు పెట్టాలి

వరంగల్‌లో గతంలో పూజారులకు ఇళ్ల స్థలాల కోసం కేటాయించిన భూమిలో రూ.కోటి మేడారం వాటా ధనంతో నిర్మించిన ధార్మిక భవనానికి సమ్మక్క, సారలమ్మల పేరు పెట్టాలని సీఎంను పూజారులు కోరారు. భవనాన్ని మేడారం పరిధిలో ఉంచుతూ ఉత్తర్వులు ఇవ్వాలన్నారు. దేవతలను గద్దెకు చేర్చే సమయంలో మూడంచెల భద్రత కల్పించాలని కోరారు.

మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

జాతరకు వచ్చే భక్తులకు మెరుగైన శాశ్వత వసతులు కల్పించాలని, ప్రతీసారి పనులకు ఆటంకం కలిగిస్తున్న అటవీ శాఖ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని పూజారులు విజ్ఞప్తి చేశారు. మేడారం జాతరకు అనుబంధ దేవతలైన పగిడిద్దరాజు, గోవిందరాజులు ఉండే పూనుగొండ్ల, కొండాయికి మాత్రమే దేవాదాయ గుర్తింపును ఇచ్చిందని తెలిపారు.

కార్మిక చట్టాలను అమలు చేయాలి

రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాపర్తి సోమయ్య



వాల్‌పోస్టర్ల ఆవిష్కరణలో రాపర్తి సోమయ్య, ప్రజా సంఘాల ప్రతినిధులు

జఫర్‌గడ్, జనవరి 27 : పోరాడి సాధించుకున్న కార్మిక సంక్షేమ చట్టాలను అమలు చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాపర్తి సోమయ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఫిబ్రవరి 16న నిర్వహించ తలపెట్టిన దేశవ్యాప్త సమ్మె కరపత్రాలను ఆయన శనివారం జఫర్‌గడ్‌లో కార్మిక, ప్రజా సంఘాల ప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సోమయ్య మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న 44 చట్టాలను ప్రధాని మోదీ ప్రభుత్వం రద్దు చేసి వాటి స్థానంలో కార్మికులకు వ్యతిరేకంగా నాలుగు లేబర్ కోడ్లను అమల్లోకి తీసుకువచ్చిందని విమర్శించారు. జీఎస్టీ పన్నుల భారంతో వేలాది చిన్నచిన్న పరిశ్రమలు మూతపడడంతో కోట్లాది మంది కార్మికులు రోడ్డున పడ్డారన్నారు. కనీస వేతన చట్టాన్ని అమలు చేయకుండా కార్మికుల శ్రమను దోచుకుంటున్నారన్నారు. కేంద్రంలోని బీజేపీ సర్కార్ అవలంబిస్తున్న మతోన్మాద, విచ్ఛిన్నకర, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 16న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెలో అన్ని వర్గాలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నేతలు కాట సుధాకర్, నక్క యాకయ్య, వడ్లకొండ సుధాకర్, వేల్పుల చిన్నరాములు, కన్నెబోయిన నాగయ్య, పెదరాములు, నల్లతీగల శ్రీను, కాట శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఎక్కడి పనులక్కడే..


- సమీపిస్తున్న చింతగట్టు సమ్మక్క జాతర
- పట్టించుకోని అధికారులు
- కొలిక్కిరాని జాతర కమిటీ ఎన్నిక



గద్దెల వద్ద పేరుకుపోయి ఉన్న చెత్తాచెదారం

స్టేషన్‌ఘన్‌పూర్, జనవరి 27 : మండలంలోని ఇప్పగూడెం, రంగరాయగూడెం, కోమటిగూడెం, అక్కపల్లిగూడెం గ్రామాల పరిధిలోని చింతగట్టు సమ్మక్క-సారలమ్మ జాతర సమీపిస్తున్నా ఏ ఒక్క పని కూడా ప్రారంభం కాలేదు. గతంలో నెల రోజుల ముందుగానే పనులు ప్రారంభించినప్పటికి అసంపూర్తిగానే మిగిలి ఉండేవి. జాతర మరో 20 రోజుల్లో ప్రారంభం కావాల్సి ఉండగా ఇప్పటి వరకు అధికారులు పనులు ప్రారంభించక పోవడంతో భక్తులు అసహనానికి గురవుతున్నారు. ప్రతీ జాతరకు వివిధ ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో భక్తులు వచ్చి జాతర సమీపంలో విడిది చేసి నాలుగు రోజుల పాటు ఉంటారు. ఈ క్రమంలో మినీ వాటర్ ట్యాంకులను శుద్ధి చేసే పనులు, జాతర పరిసరాల్లో పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించే ఏర్పాట్లు చేయకపోవడంతో భక్తులు ఆందోళన చెందుతున్నారు. రాజకీయ పార్టీల నాయకుల మధ్య సయోధ్య కుదరక జాతర కమిటీ ఎన్నిక జరుగక అభివృద్ధి పనులకు విఘాతంగా మారింది. అధికారులైనా మేల్కొని వెంటనే జాతర పనులు ప్రారంభించాలని నాలుగు గ్రామాల ప్రజలు కోరుతున్నారు. రెండేళ్ల కోమారు వచ్చే జాతరను నిర్లక్ష్యం చేయడం తగదని అంటున్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి జాతరకు వచ్చే వేలాది మందికి ఇబ్బందులు కలుగకుండా అభివృద్ధి పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు.







నర్సింగ్ శిక్షణకు ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్

హనుమకొండ రూరల్, జనవరి 27: తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్‌కామ్), రాష్ట్ర ప్రభుత్వ కార్మిక ఉపాధి శిక్షణ కింద జపాన్‌లో నర్సింగ్ సిబ్బంది శిక్షణ, నియామకం కోసం కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఎం.మల్లయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 29వ తేదీన ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తోందని 22 నుంచి 30 యేళ్ల వయస్సుగల బీఎస్సీ నర్సింగ్, జీఎన్‌ఎం, ఏఎన్‌ఎం, డిప్లొమా పూర్తి చేసిన వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు హైదరాబాద్ విద్యానగర్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్కిల్ ట్రెయినింగ్ సెంటర్‌లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించే స్క్రీనింగ్ పరీక్షకు హాజరు కావాలన్నారు. ఇతర వివరాలకు 8919047600, 9573945684, 6302292450 లలో సంప్రదించవచ్చని ఆయన సూచించారు.

కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీగా ప్రొఫెసర్ వెంకయ్య




కేయూ క్యాంపస్, జనవరి 27: కాకతీయ యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీగా కేయూ జంతుశాస్త్ర విభాగం ప్రొఫెసర్ వై.వెంకయ్య నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు. వెంకయ్య గతంలో జంతుశాస్త్ర విభాగాధిపతిగా, బీవోఎస్ బోర్డు ఆఫ్ చైర్మన్‌గా, కేయూ క్యాంపస్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్‌గా, అడ్మిషన్ల డైరెక్టర్‌గా విధులు నిర్వహించారు. కేయూ హాస్టల్స్ డైరెక్టర్‌గా పనిచేశారు.

















ఆటోను ఢీకొట్టిన లారీ - నలుగురికి గాయాలు


ప్రమాదంలో క్షతగాత్రులు

కురవి, జనవరి 27 : కురవి మండల కేంద్రం లోని జాతీయ రహదారిపై ఆటోను లారీఢీకొన్న ఘటనలో ఐదుగురికి గాయాలయ్యాయి. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం. మాధవాపురం గ్రామానికి అరూరి వెంకన్న తన కుటుంబసభ్యులతో కలిసి ఆటోలో మహబూబాబాద్‌లో ఓ శుభకార్యంకు వెళ్తున్నారు. ఆటో కురవి వద్దకు చేరుకోగానే మహబూబాబాద్ నుంచి మరిపెడ వైపు వెళ్తున్న లారీ ఆటోను ఢీకొట్టింది. ఈ ఘటనలో చిన్నారి బాబు అరవింద్‌కు తీవ్రగాయాలయ్యాయి. మరో చిన్నారి భానుతేజకు చేయి విరిగింది. అరూరి ఉపేంద్ర, అరూరి వెంకన్న, అనిల్‌లకు గాయాలయ్యాయి. ఎస్సై గోపి ఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

కస్నాతండాలో నల్లబెల్లం పట్టివేత

డోర్నకల్, జనవరి 27 : మండలంలోని కస్నాతండా వద్ద శనివారం నాలుగు క్వింటాళ్ల నల్లబెల్లంతో పాటు 50 కిలోల పటికను పట్టుకున్నట్లు ఎస్సై ఝాన్సీ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. కస్నాతండా క్రాస్‌రోడ్డు వద్ద సమ్మక్క-సారలమ్మ గద్దెల సమీపంలో వాహనాలను తనిఖీ చేస్తుండగా ఓ నెంబర్‌ప్లేట్ లేని ఆటోను గుర్తించినట్లు చెప్పారు. దానిని తనిఖీ చేయగా అందులో నాలుగు క్వింటాళ్ల నల్లబెల్లం, 50 కిలోల పటికను గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. రవాణాకు ఉపయోగించిన ఆటోను సీజ్‌చేసి, ఇందుకు బాధ్యులైన బోరింగ్‌తండాకు చెందిన మోహన్, నాగేష్‌ను అదుపులోకి తీసుకోగా, కురవి మండలం లింగ్యాతండాకు చెందిన వెంకటేష్ పరారీలో ఉన్నట్లు ఎస్సై తెలిపారు.

యువతిని మోసగించిన యువకుడిపై కేసు నమోదు

కొత్తగూడ, జనవరి 27: పెళ్లి చేసుకోవాలని డిమాండ్ చేస్తూ ప్రియుడి ఇంటి ఎదుట ప్రియురాలు ధర్నా చేసిన ఘటన కొత్తగూడ మండలంలో శనివారం జరిగింది. యువతి (28)ని మోసగించిన యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై నగేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఓ గ్రామంలో యువతిని అదే గ్రామానికి చెందిన యువకుడు జల్లెల ప్రశాంత్ పెళ్లి చేసుకుంటానని మూడేళ్లుగా ప్రేమించాడు. కాగా, ఆ యువతిని వివాహం చేసుకోవడానికి యువకుడు నిరాకరించాడు. దీంతో ప్రశాంత్ ఇంటి ఎదుట ఆ యువతి శనివారం బైఠాయించింది. పెళ్లి చేసుకోవాలని డిమాండ్ చేసింది. కాగా, పోలీస్‌స్టేషన్‌లో ప్రశాంత్‌పై యువతి ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్టు ఎస్సై నగేష్ తెలిపారు.

మరో ఐదేళ్లు ఉచిత బియ్యం

● ఈ నెల నుంచి ఉచిత పంపిణీ కొనసాగింపు ● ఉమ్మడి వరంగల్ జిల్లాలో 9.57 లక్షల మందికి లబ్ధి

హనుమకొండ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన పథకం కింద రేషన్‌కార్డుదారులకు ఉచిత రేషన్ బియ్యం పంపిణీ కొనసాగింపు మళ్లీ ఈనెల నుంచి మొదలు కానున్నది. వచ్చే ఐదేళ్లవరకు ఇది కొనసాగుతుంది. ఉచిత బియ్యం పంపిణీకి అవసరమైన బియ్యంకోటా ఉమ్మడి వరంగల్ జిల్లాకు చేరింది. పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నారు. ఉచిత బియ్యం పంపిణీని కేంద్ర ప్రభుత్వం మరో ఐదేళ్ల పాటు పొడిగిస్తూ నిర్ణయం తీసుకోవడంతో నిరుపేదలు, అట్టడుగువర్గాల వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఉచిత బియ్యం పంపిణీ ఈనెల నుంచి మళ్లీ అమలులోకి తీసుకువస్తూ గత ఉత్తర్వులు జారీ చేసింది. కొవిడ్-19 మహమ్మారి వ్యాప్తి సమయంలో పీఎంజీకేవై పథకాన్ని 2020 మార్చిలో కేంద్రం ప్రారంభించింది. కరోనా లాక్‌డౌన్ తర్వాత పేదలను ఆదుకోవడం కోసం, వారి జీవనోపాధికి ఆసరగా నిలిచేందుకు ఈ పథకాన్ని కేంద్రం ప్రవేశపెట్టింది.

పలుమార్లు పొడిగింపు

ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ (పీఎంజీకేఏవై) ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా మొదటి, రెండో దశల కింద ఉచిత బియ్యం పంపిణీని 2020 ఏప్రిల్ నుంచి నవంబర్ వరకు అమలు చేశారు. ఆతర్వాత మూడో దశను మే నుంచి 2021 జూన్ వరకు పొడిగించారు. నాలుగోదశను 2021 జూలై నుంచి 2021 నవంబర్ వరకు, ఐదోదశను 2022 మార్చి వరకు, ఆరో దశను 2022 డిసెంబర్ వరకు, ఏడో దశను గత 2023 డిసెంబర్ వరకు కొనసాగించారు. ఇప్పుడు తాజాగా 2024 జనవరి



మరో ఐదేళ్లపాటు కొనసాగిస్తారు. ఈ పథకానికి అయ్యే ఖర్చును రాష్ట్రాలతో సంబంధం లేకుండా కేంద్రమే భరిస్తోంది. 2022 డిసెంబరు 31న ప్రధాన మంత్రి గరీబ్ కల్యాణ్ యోజన (పీఎంజీకెవై)ని జాతీయ ఆహార భద్రతాచట్టం (ఎన్ఎఫ్ఎస్ఏ)లో కేంద్రం విలీనం చేసింది. దీంతో అప్పటినుంచి ఆహార భద్రత కార్డు (రేషన్ కార్డు) ఉన్న లబ్దిదారులందరికీ ఉచిత రేషన్ బియ్యం పథకాన్ని కొనసాగిస్తోంది.

9.57 లక్షల మందికి లబ్ధి

వరంగల్, హనుమకొండ, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 9,57446మంది రేషన్ కార్డుదారులు ఉన్నారు. కేంద్ర నిర్ణయంతో ఆయా కుటుంబాలకు లబ్ధి చేకూరనున్నది. ఆహార భద్రత కార్డుదారులకు యూనిట్‌కు 6కిలోల చొప్పున, అంత్యోదయ కార్డుదారులకు 35కిలోల చొప్పున ఉచిత బియ్యం పంపిణీ చేయనున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న కార్డుదారులకు జనవరి నెలలో 19,290.47 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని కేటాయించారు. ఈబియ్యాన్ని ఈనెలలో పంపిణీ చేస్తారు.

అన్ని రేషన్ కార్డులకు..

అన్నపూర్ణ, అంత్య యోజన కార్డుదారులు, ఆహార భద్రతాకార్డు కలిగిన కుటుంబాలకు అన్ని రేషన్‌షాపులలో ఉచితంగా అందిస్తారు. కొవిడ్ మహమ్మారి సమయంలో విధించిన అదనపు నిబంధనలను కూడా తొలగించారు. కేంద్ర ప్రభుత్వం కొవిడ్‌కంటే ముందు రేషన్‌కార్డు ఉన్న వారికి కిలో బియ్యాన్ని సబ్సిడీ ధరతో రూ.1-3 వరకు అందించేది. ఐదు కిలోల చొప్పున ఒక్కొక్కరికి కేటాయించేది. అలాగే అంత్యోదయ అన్న యోజన (ఏఏవై) కుటుంబాలకు 35 కిలోల బియ్యాన్ని పంపిణీ చేసేది. అయితే ఈ స్కీమ్ అమలులోకి వచ్చినప్పటి నుంచి కేంద్రం ఒక్క పైసా కూడా తీసుకోకుండా పేదలకు ఉచితంగా రేషన్ బియ్యం పంపిణీ చేస్తోంది.

ఉచిత బియ్యం పక్కదారి

ఈ ఉచిత బియ్యాన్ని రెండేళ్లుగా కార్డుదారులు అందరూ తీసుకోవడం లేదు. 70 నుంచి 80 శాతం కార్డుదారులు మాత్రమే ప్రతీ నెల తీసుకుంటున్నారు. మిగిలిన 20 నుంచి 30 శాతం కార్డుదారులు తమ కార్డులు రద్దుకాకుండా ఉండేందుకు రెండు నెలలకోసారి తీసుకుంటున్నారు. పదిశాతం మంది కార్డుదారులు ఈ ఉచిత బియ్యాన్ని కిలో ఒక్కంటికి రూ.8 నుంచి రూ.10 లకు రేషన్‌షాపు డీలర్లకే విక్రయిస్తున్నారు. మిగిలిన 20శాతం కుటుంబాలు కిరాణం, ఇడ్లీ బండ్లు, చిరువ్యాపారులకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సీతారాంనాయక్ తదితరులు

జర్నలిస్టులు ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలి

మాజీ ఎంపీ సీతారాంనాయక్

వడ్డెపల్లి, జనవరి 27: సామాజిక స్పృహ కలిగిన జర్నలిస్టులు ప్రజాస్వామ్యాన్ని పరక్షించాలని ప్రముఖ బంజారా నేత, మాజీ ఎంపీ అజ్మీరా సీతారాంనాయక్ అన్నారు. బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్టు అసోసియేషన్ నిర్వహించిన సమావేశంలో శనివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించినన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్టు అసోసియేషన్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు బానోతు వెంకన్న, జిల్లా అధ్యక్షుడు గుగులోతు హుస్సేన్ నాయక్, కార్యదర్శి దేవేందర్ నాయక్, జర్నలిస్టులు అంతడుపుల శ్రీనివాస్, రోజనాల శ్రీనివాస్, శోభన్‌బాబు, మాడ నర్సయ్య, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం


విద్యుదాఘాతంతో దగ్ధమైన ఇల్లు

పరకాల, జనవరి 27: విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధమైన సంఘటన పరకాల పట్టణంలో శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. బాధితుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పరకాల పట్టణానికి చెందిన నేరెళ్ల పరశురాంకు చెందిన ఇంట్లో ఫ్రిడ్జి ప్లగ్ షార్ట్ సర్క్యూట్ జరిగి ఇంట్లో ఎవరూ లేని సమయంలో సాయంత్రం 4 గంటల ప్రాంతంలో పెద్ద ఎత్తున మంటలు లేచాయి. ఇది గమనించిన చుట్టూపక్కల ప్రజలు స్థానిక ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించడంతో ఫైర్ సిబ్బంది వెంటనే చేరుకొని మంటలను ఆర్పివేశారు. అప్పటి వరకే ఇంట్లో ఉన్న ఫ్రిడ్జితోపాటు ఇంటి పైకప్పు, ఇంట్లోని సమాన్లతోపాటు డబ్బులు మంటల్లో కాలిపోగా, రూ. 2 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు పేర్కొన్నారు.

బెల్టుషాపుపై టాస్క్‌ఫోర్స్ దాడులు


పట్టుకున్న మద్యాన్ని చూపిస్తున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

హనుమకొండ క్రైం, జనవరి 27: సుబేదారి పీఎస్ పరిధిలోని వడ్డెపల్లిలో అక్రమంగా విక్రయిస్తున్న బెల్టుషాపుపై వరంగల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం దాడులు చేశారు. ఈ దాడులలో రూ.74వేల విలువ గల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపిన వివరాల ప్రకారం.. వడ్డెపల్లిలోని పెసరు రాజ్‌కుమార్ అనే వ్యక్తి కొద్దిరోజులుగా ఇంటినే అడ్డాగా చేసుకుని బెల్టుషాపు నడిపిస్తున్నట్టు పక్కా సమాచారం అందింది. దీంతో శనివారం సాయంత్రం టాస్క్‌ఫోర్స్ సిబ్బంది దాడులు చేసి రాజ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని ఇంట్లో డంప్ చేసిన వివిధ బ్రాండ్లకు సంబంధించిన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి పట్టుకున్న మద్యాన్ని సుబేదారి పోలీసులకు అప్పగించారు. ఈ దాడులలో టాస్క్‌ఫోర్స్ పోలీసులతో పాటు సివిల్ పోలీసులు పాల్గొన్నారు.

శివనగర్‌లో భారీ చోరీ

15 తులాల బంగారం, 25 తులాల వెండి, 45వేల నగదు అపహణ

ఖిలావరంగల్, జనవరి 27: వరంగల్ అండర్ బ్రిడ్జి ప్రాంతం శివనగర్‌లో తాళం వేసి ఉన్న ఇంట్లో శుక్రవారం రాత్రి భారీ చోరీ జరిగింది. శనివారం ఉదయం ఘటన వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం. వరంగల్ రైల్వే స్టేషన్ శివనగర్ ఎదురుగా ఉన్న ఇంట్లో వ్యాపారం (బాటర్ బాటిల్ అమ్మకం) పూజారి రవి-శ్రీలత దంపతులు ఉంటున్నారు. వీరికి ఇద్దరు కుమారులుండగా, వారు హైదరాబాద్‌లో ఉంటున్నారు. రవికి అనారోగ్యం కారణంగా దంపతులు మూడు రోజుల క్రితం వైద్యపరీక్షల నిమిత్తం రాజస్థాన్‌కు వెళ్లారు. శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి 15తులాల బంగారం, 25తులాల వెండి, 45వేల నగదు అపహరించారు. బంగారం, వెండి, నగదు కలిపి సుమారు కోటి రూపాయల దొంగతనం జరిగినట్లు తెలిపారు. శనివారం ఉదయం రవి తమ్ముడి భార్య ఇంట్లోని చెట్లకు నీళ్ల పట్టే క్రమంలో ఇంటికి వేసిన తాళాన్ని పగలకొట్టి ఉండడం చూసి, మిల్స్‌కాలనీ పోలీసులకు సమాచారమిచ్చింది. పూజారి భాస్కర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం విషయాన్ని పోలీసులు రవి కుటుంబానికి సమాచారమిచ్చారు. వారి చెప్పిన దాని ప్రకారం చోరీ అంచనా వేశారు. కేసును సీఐ సురేష్ దర్యాప్తు చేస్తున్నారు.

బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం

పర్వతగిరి, జనవరి 27 : మండలంలోని దౌలత్‌నగర్‌లో శనివారం ఉమ్మడి జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభమయ్యాయి. అసోసియేషన్ జనరల్ సెక్రటరీ బి.వీరన్న, ఆర్గనైజర్ పిండి కొమురయ్యలు క్రీడలను ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో జడ్పీ కో ఆప్షన్ సభ్యుడు సర్వర్, సర్పంచ్ కొల్లూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. మొదటి రోజు 13 జట్లు పాల్గొన్నాయని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు బండి వెంకటేశ్వర్లు, పిండి మల్లికార్జున్, కత్తుల శ్రీనివాస్, నల్గొండ సూర్యప్రకాష్, ఎస్సెమ్సీ చైర్మన్ బొమ్మెర సుధాకర్ పాల్గొన్నారు.

విద్యార్థులు విశ్వ విజేతలుగా ఎదగాలి

జిల్లా అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తా

ఘనంగా ఏకశిల పాఠశాలల వార్షిక వేడుకలు

హసన్‌పర్తి, జనవరి 27: విద్యార్థులు విశ్వ విజేతలుగా ఎదగాలని, మారుతున్న పోటీ ప్రపంచంలో తమ గమ్యాన్ని నిర్దేశించుకుని ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తా కోరారు. హసన్‌పర్తి మండలం పెంబర్తి వద్ద గల ఏకశిలా టెక్నో స్కూల్‌లో శనివారం ఏకశిలా పాఠశాలల వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విలువలతో కూడిన విద్యను అభ్యసించినప్పుడే ఏ రంగంలోనైనా గొప్ప వక్తులుగా తయారవుతారన్నారు. ఉన్నత స్థానానికి చేరి నలుగురికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదిగినప్పుడే కీర్తించబడుతారన్నారు.

అనంతరం జిల్లా విద్యాశాఖాధికారి ఎండీ. అబ్దుల్‌హై మాట్లాడుతూ.. దేశాభివృద్ధిలో తరగతి గది పాత్ర ప్రధానమైనదన్నారు. విద్యార్థులను సక్రమమైన పద్ధతిలో, క్రమశిక్షణ గల పౌరులుగా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఏకశిలా విద్యాసంస్థల చైర్మన్ గౌరు తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. ఏకశిలా విద్యా సంస్థల ద్వారా విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. పదో తరగతిలో 10/10 జీపీఏ, సీబీఎస్ఈలో 485 మార్కులు సాధించిన విద్యార్థులకు ఏకశిలా జూనియర్ కళాశాలలో ఉచిత విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ఏకశిలా విద్యా సంస్థల డైరెక్టర్లు గౌరు సువిజారెడ్డి, బేతి కొండల్ రెడ్డి, ముచ్చ జితేందర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు సీహెచ్ దినేష్‌రెడ్డి, బేతి శైలజ, స్వప్నరెడ్డి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాలను ప్రారంభిస్తున్న ముఖ్య అతిథులు



ఆత్మకూరు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న వినియోగదారుల మండలి ప్రతినిధులు

పెద్దాపురంలో అక్రమ మైనింగ్‌పై చర్యలు తీసుకోండి..

ఆత్మకూరు తహసీల్దార్‌కు వినియోగదారుల మండలి ఫిర్యాదు

హనుమకొండ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం పెద్దాపురం గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా మైనింగ్ జరుగుతోందని వియోగదారుల మండలి రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు సాంబరాజు చక్రపాణి, సంయుక్త కార్యదర్శి నల్లా రాజేందర్ శనివారం ఆత్మకూరు తహసీల్దార్ జగన్మోహన్‌రెడ్డి కలిసి ఫిర్యాదు చేశారు. రెవెన్యూ శాఖ నుంచి ఎన్ఓసీ (నో ఆబ్జెక్షన్ సర్టిఫికెట్)లు లేకుండా మైనింగ్ సంస్థలు బ్లాక్‌గ్రానైట్‌ను తీస్తున్నాయని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. పెద్దాపురం మైనింగ్ సంబంధించి ఎన్ఓసీలు దొరకడం లేదని అధికారులు చెబుతున్నారని తెలిపారు. సర్వే నెంబరు 584/1లో రెండు మైనింగ్ సంస్థలు మైనింగ్ శాఖ చేసుకున్న అగ్రిమెంట్లు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయని, ఇప్పటికీ రెండు సంస్థలు పర్యావరణ నిబంధనలు అతిక్రమించిందువల్ల న్యాయస్థానాలు జరిమానా విధించాయని, లోకాయుక్తలో విచారణ జరుగుతున్నదని తెలిపారు. అయినా కూడా నిబంధనల ప్రకారం మైనింగ్ నిర్వహించకపోవడంపై రెవెన్యూశాఖ ఇకనైనా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. సర్వే నెంబరు 584/లో 2008 నుంచి మైనింగ్ జరుగుతున్న క్రమంలో అక్కడ ఉన్న గుట్ట అతి పెద్ద బిలంగా మారిపోయి స్థానిక ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడే పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. అనంతరం ధరణి పోర్టల్‌కు సంబంధించిన ఫిర్యాదులను తహసీల్దార్‌కు ఇచ్చారు.

వైద్యం కోసం సాయం చేయండి..


మాట్లాడుతున్న నాగరాజు, మౌనిక

వడ్డెపల్లి, జనవరి 27: తమ కుమారుడి వైద్యం కోసం సహాయం చేయాలని ములుగు జిల్లా చల్వాయి గ్రామానికి చెందిన నాగరాజు, మౌనిక దంపతులు వేడుకుంటున్నారు. ఈ మేరకు హనుమకొండలోని ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడారు. త కుమారుడు లక్ష్మణ్ ఇటీవల ఆడుకుంటూ కిందపడడంతో తలకు తీవ్ర గాయాలై ఫిట్స్ రావడం ప్రారంభం అయ్యాయి. తల్లిదండ్రులు వెంటనే హనుమకొండలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చేర్పించారు. లక్ష్మణ్‌కు వెంటిలేటర్‌పై వైద్యులు చికిత్స అందిస్తున్నారు. రోజుకు రూ.55 నుంచి 60వేల వరకు ఖర్చు అవుతోందని చెప్పారు. ప్రయివేట్ ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్న తాము కుమారుడి వైద్య ఖర్చులు భరించే స్థోమత లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దాతలు ముందుకొచ్చి తమ కుమారుడికి ప్రాణభిక్ష పెట్టేందుకు ఆర్థిక సహకారం అందించాలని నాగరాజు, మౌనిక వేడుకుంటున్నారు. ఫోన్‌పే నంబర్ 8008994920కు ఆర్థికసాయం పంపించాలని వారు కోరారు.

క్రికెట్ టోర్నమెంట్ విజేతగా 'ఏకశిల'



ఏకశిల టీంకు ట్రోఫీ అందజేస్తున్న ఏబీవీపీ నాయకులు

జనగామ టౌన్, జనవరి 27: జనగామ పట్టణంలోని ప్రిస్టన్ స్కూల్ గ్రౌండ్‌లో ఏబీవీపీ ఆధ్వర్యంలో ఈ నెల 23న మొదలుపెట్టిన క్రికెట్ టోర్నమెంట్స్ శనివారం ముగిశాయి. మొత్తం 16 డిగ్రీ కళాశాలల టీంలు పోటీల్లో పాల్గొనగా ఏకశిల, ఏబీవీ డిగ్రీ కళాశాలల టీంలు ఫైనల్స్‌కు చేరాయి. చివరి రోజు జరిగిన ఫైనల్స్‌లో ఏకశిల టీం విజేతగా, ఏబీవీ టీం రన్నరప్‌గా నిలిచాయి. పీఆర్ ఫౌండేషన్ చైర్మన్ శ్యామ్‌సుందర్‌రావు సహకారంతో విన్నర్, రన్నర్ టీంలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా కన్వీనర్ తోట హృతిక్‌సాయి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కార్తీక్, వంశీ, నితీష్, అరవింద్, నవీన్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లాస్టిక్ రహిత బాటిళ్ల అందజేత



విద్యార్థులకు ప్లాస్టిక్ రహిత బాటిళ్లను అందజేస్తున్న దాతలు

లింగాలఘణపురం, జనవరి 27: మండలంలోని చిక్కులోనిగూడెం ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థులకు శనివారం జనగామ పట్టణానికి చెందిన లోన్ అండ్ ఫైనాన్స్ కన్సల్టెంట్ ఉపేందర్ యాదవ్, జనగామ పట్టణ బీజేపీ అధ్యక్షుడు పవన్ శర్మ ప్లాస్టిక్ రహిత బాటిళ్లను అందజేశారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయుడు లక్ష్మణ్‌గౌడ్ అధ్యక్షత వహించగా సర్పంచ్ బోళ్ల సత్యనారాయణ, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్లాస్టిక్ నివారణ ప్రతీ ఒక్కరి బాధ్యతగా స్వీకరించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణ, పంచాయతీ కార్యదర్శి ప్రవళిక, ఉపసర్పంచ్ రమేశ్, అంగన్‌వాడీ టీచర్ వెంకటలక్ష్మి, సరిత పాల్గొన్నారు.

ఇంటి నంబర్లు ఇంకెప్పుడిస్తారు?

▸▸ సీపీఎం పట్టణ కార్యదర్శి జోగు ప్రకాశ్



సమావేశంలో మాట్లాడుతున్న జోగు ప్రకాశ్

జనగామ టౌన్, జనవరి 27: పట్టణంలోని బాణాపురంలో గల చాకలి ఐలమ్మ నగర్‌లో ఇందిరమ్మ మూడో విడత లబ్ధిదారులకు ప్లాట్లు చూపించిన అధికారులు ఇతర వసతులను మరిచారని సీపీఎం పట్టణ కార్యదర్శి జోగు ప్రకాశ్ అన్నారు. ట్యాంకర్ల సాయంతో నీటి వసతిని ఏర్పాటు చేసుకుని ఇండ్లు నిర్మించుకుంటే ఇంటి నంబర్ల కేటాయింపులో ఎందుకు జాప్యం చేస్తున్నారని ప్రశ్నించారు. శనివారం ఆయన సీపీఎం జిల్లా కార్యాలయంలో కల్యాణం లింగం అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. చాకలి ఐలమ్మ నగర్‌లో ఇండ్లు కట్టుకున్న ప్రతీ ఒక్కరికి మ్యుటేషన్ చేసి ఇంటి నంబర్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంతేగాకుండా గృహలక్ష్మి ద్వారా రూ.5 లక్షల రుణం మంజూరు చేయాలన్నారు. నీరు, కరెంట్ వంటి మౌలిక వసతులు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో సీపీఎం నాయకులు బొట్ల శ్రీనివాస్, బూడిద గోపి, దామెర అబ్రహం, ముప్పట్ల జయ, భవాని, శశిరేఖ, బాలమణి, కమల పాల్గొన్నారు.

జడ్పీ సీఈవోకు సన్మానం



జడ్పీ సీఈవో అనిల్‌కుమార్‌ను సన్మానిస్తున్న ఎంపీడీవో ఉమామహేశ్వర్, సిబ్బంది

దేవరుప్పుల, జనవరి 27: ఉత్తమ ఉద్యోగిగా అవార్డు పొందిన జనగామ జడ్పీ సీఈవో అనిల్‌కుమార్‌ను శనివారం దేవరుప్పుల మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఉమామహేశ్వర్‌రావుతో పాటు సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఎంపీడీవో కార్యాలయానికి సీఈవో అనిల్‌కుమార్ ఆకస్మికంగా వచ్చారు. ఈ సందర్భంగా ఆయన 15వ ఆర్థిక ప్రణాళికా నిధుల(ఎస్ఎఫ్‌సీ) పనుల పురోగతిని, జడ్పీటీసీ, ఎంపీటీసీల పనుల విషయమై అడిగి తెలుసుకున్నారు. ఆతర్వాత రికార్డులను పరిశీలించారు. పనులు వేగవంతంగా జరుగాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీవో తాటి సురేష్‌కుమార్, సూపరింటెండెంట్ రవీందర్, సీనియర్ అసిస్టెంట్ మల్లీశ్వర్, సిబ్బంది పాల్గొన్నారు.

కోతుల బెడద నుంచి కాపాడండి : బీజేపీ

జఫర్‌గడ్, జనవరి 27: కోతుల బెడదతో రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, వాటి నివారణకు చర్యలు తీసుకోవాలని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి కోరుకొప్పుల నాగేశ్ గౌడ్, శక్తి కేంద్రం ఇంచార్జి సింగారపు రమేశ్, మండల పార్టీ నేత కత్తి సందీప్ ఉన్నతాధికారులను కోరారు. ఈ మేరకు శనివారం వారు జఫర్‌గడ్ తహసీల్దార్ ఆంజనేయులుకు వినతిపత్రం అందించారు. అనంతరం బీజేపీ నేతలు మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామంలో కోతులు వందలాదిగా గుంపులు గుంపులుగా సంచరిస్తూ రైతుల పంటలను నాశనం చేస్తున్నాయన్నారు. ప్రజలు, రైతులపై దాడులు చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నాయన్నారు. అలాగే అనేక గ్రామాల్లో కుక్కలు సంచరిస్తూ పిల్లలు, పెద్దలపై దాడులు చేస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నల్లతీగల చిరంజీవి, కొమురెల్లి తదితరులు పాల్గొన్నారు.

జన జాతరపై విద్యార్థుల డిబెట్

▸▸ ఆలోచింపజేసిన కేజీబీవీ విద్యార్థుల తీర్మానాలు



కేజీబీవీలో నమూనా జిల్లా పరిషత్ మీటింగ్ నిర్వహిస్తున్న విద్యార్థులు

లింగాలఘణపురం, జనవరి 27: ప్రతీ రెండేళ్లకోసారి జరిగే తెలంగాణ కుంభమేళా మేడారం సమ్మక్క, సారలమ్మ జన జాతర ఏర్పాట్లలో అధికారులు చేపట్టాల్సిన చర్యలు, పాలకులు అమలు చేయాల్సిన విధి విధానాలను లింగాలఘణపురం కేజీబీవీ విద్యార్థులు శనివారం పర్యావరణ అంశంపై జిల్లా పరిషత్ నమూనా డిబెట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ డిబేట్ ద్వారా భక్తులతో పాటుగా అధికార, పాలక వర్గాలకు ఉపయుక్తమైన సందేశాత్మక చర్చలు నిర్వహించి ప్రతీ ఒక్కరిని ఆలోచింపజేశారు. స్పెషల్ ఆఫీసర్ అన్నపూర్ణ ఆధ్వర్యంలో 8, 9వ తరగతికి చెందిన విద్యార్థులను రెండు బృందాలుగా వర్గీకరించారు. ఒక బృందాన్ని అధికారుల వర్గంగా, మరో బృందాన్ని అధికార, పాలకపక్ష బృందాలుగా వర్గీకరించి పర్యావరణ పరిరక్షణ అంశంపై డిబేట్‌లో చర్చలు నిర్వహించి తీర్మానాలు చేశారు. ఈ డిబేట్‌లో రవాణా వ్యవస్థ, ప్లాస్టిక్ వినియోగం నిషేధం, సురక్షిత తాగునీటి సరఫరా, పరిశుభ్రతకు మరుగుదొడ్లు, స్నానఘట్టాలు, చెత్తసేకరణ, తరలింపు, ట్రాఫిక్ నియంత్రణ, జేబుదొంగల కట్టడి, యాత్రికుల ప్రవర్తనపై చేపట్టాల్సిన చర్యలు, ముందు జాగ్రత్తలు, పర్యావరణ అంశాలపై తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

చెకుముకి సైన్స్ టాలెంట్ పరీక్షలు





స్టేషన్‌ఘన్‌పూర్‌లో విజేతలకు బహుమతులు అందిస్తున్న నోడల్ అధికారి కొమురయ్య, పాలకుర్తిలో బహుమతులు అందచేస్తున్న అధికారి నర్సయ్య

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, జనవరి 27 : స్థానిక శివునిపల్లి పట్టణ హైస్కూల్‌లో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శనివారం మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. 17 హైస్కూళ్లకు చెందిన 8, 9, 10 తరగతుల విద్యార్థులు పోటీల్లో పాల్గొనగా ప్రతిభా పాటవ పరీక్షను మండల నోడల్ అధికారి జి.కొమురయ్య ప్రారంభించారు. జిల్లా స్థాయికి ఎంపికైన వారికి బహుమతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నోడల్ అధికారి మాట్లాడుతూ ఇలాంటి పరీక్షలు విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంపొందిస్తాయన్నారు. ఎంపికైన విద్యార్థులు ఫిబ్రవరి 3న జనగామలో నిర్వహించే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో చెకుముకి టాలెంట్ టెస్ట్ కన్వీనర్ డి.సత్యప్రకాష్, ఇన్‌చార్జి హెచ్ఎం శ్రీనాథ్, ఉపాధ్యాయులు రత్నాకర్, శ్రీనివాస్, వాణి, సుధ, శర్మ, యాదగిరి,శ్రావణ్, రమేశ్ పాల్గొన్నారు.

● లింగాలఘణపురం : లింగాలఘణపురం మండల కేంద్రంలో శనివారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండల స్థాయి సైన్స్ టాలెంట్ పరీక్షలను నిర్వహించారు. ఈ పోటీల్లో తెలుగు మీడియం విద్యార్థులు 9 మంది ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు 24 మంది, ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులు 6 మంది పాల్గొన్నారు. ఇందులో మోడల్ స్కూల్‌కు చెందిన గైడ్ టీచర్ కె. అశోక్ ఆధ్వర్యంలో యోగిని, నాగరాజు, రాంచరణ్, జడ్పీహెచ్ఎస్ కళ్లెంకు చెందిన గైడ్ టీచర్ నాగరాజు ఆధ్వర్యంలో నవ్య, ఎస్‌పీఆర్ హైస్కూల్‌కు చెందిన గైడ్ టీచర్ రజనీకాంత్ ఆధ్వర్యంలో చంద్రశేఖర్‌రెడ్డి, సంజుక్తా, గాయత్రిలు ప్రతిభను కనబర్చారు. కార్యక్రమంలో ప్రతిభావంతులైన విద్యార్థులను నోడల్ ఆఫీసర్ విష్ణుమూర్తి, హెచ్ఎం మల్లికార్జున్, జనవిజ్ఞాన వేదిక మండల కన్వీనర్ బందేజు, శ్రీనివాసచారి, సర్పంచ్ విజయమనోహర్, ఉపాధ్యాయురాలు పద్మ అభినందించారు.

● బచ్చన్నపేట : సమాజంలోని మూఢ విశ్వాసాలను దూరం చేసేందుకు జన విజ్ఞాన వేదిక చేస్తున్న కృషి అభినందనీయమని ఎస్ఐ సతీష్ అన్నారు. మండల కేంద్రంలో జేవీవీ ఆధ్వర్యంలో చెకుముఖి టాలెంట్ టెస్ట్ నిర్వహించగా, మండలంలోని పాఠశాలల విద్యార్థులు హాజరై ప్రతిభను చూపారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ మూర్తి, మండల కన్వీనర్ నర్సింహ్మారావు, జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

● తరిగొప్పుల : విద్యార్థులు సైన్స్ పట్ల అభిరుచిని పెంపొందించే విధంగా వారిలో సృజనాత్మకతను వెలికి తీసేందుకు జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి చెకుముకి పోటీలు నిర్వహించారు. ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల 8, 9, 10వ తరగతి విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరిచారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం రాంచంద్రం, ఉపాధ్యాయులు బానోతు రవీందర్, మచ్చ చిరంజీవులు, కట్ల యాదగిరి, కొండ రజిని, జి.నర్సయ్య, అమర్‌నాథ్ పాల్గొన్నారు.

● చిలుపూర్ : జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చిన్నపెండ్యాల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన చెకుముకి టాలెంట్ పరీక్షలో చిలుపూర్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబర్చి ప్రథమ స్థానంలో నిలవడంతో పాటు జిల్లా స్థాయి పరీక్షకు ఎంపికైనట్లు హెచ్ఎం దాసి శ్రవణ్ కుమార్ తెలిపారు. మండలంలోని రాజవరం, పల్లగుట్ట, శ్రీపతిపల్లి తదితర గ్రామాల ఉన్నత పాఠశాల విద్యార్థులు చెకుముకిపరీక్షలో పాల్గొన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం సంపత్, సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● రఘునాథపల్లి : విద్యార్థులు సైన్స్ పట్ల మరింత ఆసక్తిని పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని ఎస్ఐ సిహెచ్.రఘుపతి అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ సంబరాలతో పాటు సైన్స్ టాలెంట్ పరీక్షలను శనివారం నిర్వహించగా మండలంలోని పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక మండల కన్వీనర్ జ్యోతి శ్రీహరి, మండల నోడల్ అధికారి రఘునందన్‌రెడ్డి, రఘునాథపల్లి, నిడిగొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉపేంద్రం, ఆనంద్‌కుమార్, జేవీవీ జిల్లా బాధ్యుడు శోభన్‌రెడ్డి, ఉపాధ్యాయులు బాల్నె నాగభూషణం, యాకయ్య, జంపయ్య, పుల్లారెడ్డి, సత్యనారాయణ, మధుసూదన్‌రెడ్డి, వేణుగోపాలరావు, ప్రసూనారాణి, నర్సింగరావు, సమ్మయ్య పాల్గొన్నారు.

● జఫర్‌గడ్ : జఫర్‌గడ్‌లో జన విజ్ఞాన వేదిక మండల కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ పరీక్షలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జన విజ్ఞాన వేదిక జిల్లా పరిశీలకులు మంగు జయప్రకాశ్ మాట్లాడుతూ ఇలాంటి సైన్స్ పరీక్షల వల్ల విద్యార్థుల్లో తార్కిక ఆలోచన అలవడుతుందన్నారు. విజేతలైన అరవింద్‌వర్మ, శివకుమార్, అఖిల్‌నిహారిక, సాయితేజ, స్మితి, అద్విత, స్నేహలకు సామాజిక సేవా సంస్థల ప్రతినిధి పల్లె రాజిరెడ్డి మెమెంటోలు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వేదిక మండల కన్వీనర్ కోరుకొప్పుల రాజు, హెచ్ఎం గణేష్‌రెడ్డి, సైన్స్ ఉపాధ్యాయులు తిరుపతిరెడ్డి, శ్రీనివాస్, బాలప్రతాప్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, సల్లావుద్దీన్, మనోహర్, శ్రీనివాస్, సరోజ, పద్మ పాల్గొన్నారు.

● పాలకుర్తి : విద్యార్థులు సైన్స్ పట్ల పరిజ్ఞానాన్ని పెంచుకోవాలని చెకుముకి మండల కన్వీనర్ చిక్కుడు శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక, చెకుముకి మండల కమిటీ ఆధ్వర్యంలో టాలెంట్ టెస్టు నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు సైన్స్‌పై అవగాహన పెంచుకోవాలని సూచించారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానంచేశారు. మండల నోడల్ అధికారి పోతుగంటి నర్సయ్య, టీఎస్‌యూటీఎఫ్ నాయకులు వీరమల్ల బాబయ్య, రమేష్, యాకయ్య, కవిత, శ్రీనివాస్, నరసింహస్వామి పాల్గొన్నారు.

రైతులకు పెరటి కోళ్ల పంపిణీ



మాన్‌సింగ్‌తండాలో రైతులకు పెరటి కోళ్లను పంపిణీ చేస్తున్న లోడి సంస్థ

తరిగొప్పుల, జనవరి 27: మానోస్ యూనిదాస్ వారి సహకారంతో లోడి సాంఘీక సేవా సంస్థ డైరెక్టర్ ఫాదర్ ఇన్నారెడ్డి ఆదేశాల మేరకు సంస్థ ప్రతినిధులు శనివారం మండలంలోని మాన్‌సింగ్‌తండా, వెంకట్‌తండా, బొడ్రాయితండా, బొంతగట్టునాగారం గ్రామాల్లో రైతులకు పెరటి కోళ్లను పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా లోడి సంస్థ ప్రాజెక్టు కోఆర్డినేటర్ బాలశౌరి హాజరై రైతులను ఉద్దేశించి మాట్లాడారు. తాము రైతులకు పంపిణీ చేసిన కోడిపిల్లలకు సరైన ఆహారం అందించినట్లైతే తొందరగా పెరిగి సంవత్సరానికి 170కి పైగా గుడ్లను పెడతాయని తెలిపారు. రైతులకు వ్యవసాయంతో పాటు పెరటి కోళ్ల పెంపకం ద్వారా అదనపు ఆదాయం సమకూరుతోందనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమంలో చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ కోఆర్డినేటర్ కోడం సత్యనారాయణ, ప్రతినిధులు కనకం రవీందర్, బిచ్చ, తిరుమల, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

బచ్చన్నపేట, జనవరి 27: బచ్చన్నపేట మండల సర్వసభ్య సమావేశం ఈనెల 29న నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ బావండ్ల నాగజ్యోతి కృష్ణంరాజు తెలిపారు. ఈ మేరకు శనివారం మాట్లాడుతూ ఉదయం 11గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లతో పాటు వివిధ శాఖల అధికారులు హాజరు కావాలన్నారు. స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సమావేశానికి హాజరవుతున్నట్లు తెలిపారు.

డీసీసీ కార్యాలయంలో ఓటరు హెల్ప్ డెస్క్

జనగామ టౌన్, జనవరి 27: ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎన్నికల నేపథ్యంలో గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు కోసం పట్టణంలోని డీసీసీ కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి శనివారం తెలిపారు. ఫిబ్రవరి 6 లోపు గ్రాడ్యుయేట్ ఓటరు కోసం నమోదు చేసుకోవాలని, ఏమైనా సందేహాలు ఉంటే డీసీసీ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. తమ వద్ద ఫారం-18 అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ అవకాశాన్ని గ్రాడ్యుయేట్లు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సేవాలాల్ జయంతిని సెలవు దినంగా ప్రకటించాలి

జనగామ టౌన్, జనవరి 27 : సేవాలాల్ జయంతి రోజు ఫిబ్రవరి 15న సెలవు దినంగా ప్రకటించాలని సేవాలాల్ విద్యార్థి సేన జిల్లా కార్యదర్శి లావుడ్యా అనిల్ చౌహాన్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన జనగామలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సేవాలాల్ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్నప్పటికీ సెలవు దినంగా ప్రకటించడం లేదన్నారు. ఐదేళ్లుగా తమ డిమాండ్‌ను వినిపించుకోవడం లేదని, కొత్త కాంగ్రెస్ ప్రభుత్వమైనా స్పందించాలని కోరారు. సమావేశంలో సంతోశ్, గణేశ్, రాజు, శంకర్, మహేందర్, అన్వేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలీంపూర్‌లో హైమాస్ట్ లైట్లు ప్రారంభం



హైమాస్ట్ లైట్లు ప్రారంభిస్తున్న సర్పంచ్, ఎంపీటీసీ

బచ్చన్నపేట, జనవరి 27: మండలంలోని ఆలీంపూర్ గ్రామంలో జడ్పీ నిధులతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను శనివారం సర్పంచ్ నరెడ్ల బాల్‌రెడ్డి, ఎంపీటీసీ ఎండీ మసూద్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో అన్ని వీధుల్లో లైటింగ్ సౌకర్యం మెరుగుపర్చేలా చర్యలు తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ పర్వతం కవిత తిరుపతి, కార్యదర్శి రేవతిగౌడ్, వార్డు సభ్యులు బాలరాజు, నందిని, భిక్షపతి, జీపీ సిబ్బంది పాల్గొన్నారు. అంతకుముందు సర్పంచ్ పదవీకాలం ముగుస్తున్నందున జీపీలో సర్పంచ్‌తో పాటు, వార్డు సభ్యులను పలు శాఖల బాధ్యులు సన్మానించారు. గ్రామాభివృద్ధిలో ప్రజాప్రతినిధులు చూపిన చొరవను ప్రశంసించారు.

పట్టభద్రులంతా ఓటును నమోదు చేసుకోవాలి

▸▸ డీసీసీ కార్యదర్శి గంగం నర్సింహారెడ్డి



నర్మెటలో మాట్లాడుతున్న డీసీసీ కార్యదర్శి గంగం నర్సింహారెడ్డి


నర్మెట, జనవరి 27 : అర్హులైన పట్టభద్రులంతా తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని డీసీసీ కార్యదర్శి గంగం నర్సింహారెడ్డి అన్నారు. నర్మెట మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాబోయే ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన వారికే పట్టభద్రులంతా పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. ఓటు నమోదుపై ఎలాంటి సందేహాలు ఉన్నా మండల కాంగ్రెస్ నాయకులు అందుబాటులో ఉంటారని తెలిపారు. దరఖాస్తు కోసం ఫారం-18 అందుబాటులో ఉందని పేర్కొన్నారు. ఫిబ్రవరి 6 వరకు ఓటును నమోదు చేసుకోవాలన్నారు. ప్రజా సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. పట్టభద్రులంతా ఆలోచించి తమ ఓటును వినియోగించుకోవాలని కోరారు. సమావేశంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గొల్లపల్లి కుమారస్వామి, పరీదుల యాదయ్య, మహిళా అధ్యక్షురాలు చంద్రకళ, చెవుల పరుశరాములు, కన్నెబోయిన రామకృష్ణ, కూకట్ల చంద్రమౌళి, కల్యాణం మురళి, భూక్య జయరాం, బైరగోని అంజయ్య, వలబోజు శ్రీనివాస్, ప్రజ్ఞాపురం శ్రీధర్, ముద్దం గట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

● బచ్చన్నపేట : ఉమ్మడి వరంగల్-నల్గొండ-ఖమ్మం జిల్లాల్లో త్వరలో జరగబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు అర్హులైన వారు ఓటరుగా నమోదు చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు నల్లగోని బాలకిషన్‌గౌడ్ కోరారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ ఫిబ్రవరి 6వ తేది చివరి రోజు కావటంతో పట్టభద్రులు ఓటు నమోదు పట్ల నిర్లక్ష్యం చూపరాదన్నారు. జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ కొనసాగుతోందన్నారు. దరఖాస్తు కోసం ఫారం-18 అందుబాటులో ఉంచటం జరుగుతుందని పేర్కొన్నారు.

30న మండల సర్వసభ్య సమావేశం

రఘునాథపల్లి, జనవరి 27 : మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 30న ఉదయం 11 గంటలకు స్థానిక మండల ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో జరుగుతుందని ఎంపీడీవో ఎండి.హషీం తెలిపారు. సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

రాష్ట్ర స్థాయి మ్యాథ్స్ టాలెంట్ టెస్టుకు శృతి ఎంపిక



కొడకండ్ల, జనవరి 27 : మండల కేంద్రంలోని టీఎస్ఆర్ఎస్ గురుకుల పాఠశాల విద్యార్థిని శృతి రాష్ట్ర స్థాయి మ్యాథ్స్ టాలెంట్ టెస్టు పోటీలకు ఎంపికైందని ప్రిన్సిపాల్ తమ్మి దిలీప్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ జనగామలో తెలంగాణ మ్యాథమెటిక్స్ ఫోరం ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన జిల్లా స్థాయి మ్యాథ్స్ టాలెంట్ టెస్టు పోటీల్లో టీఎస్ఆర్ఎస్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థిని ఎస్.శృతి ద్వితీయ స్థానాన్ని సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్‌తో పాటు పాఠశాల ఉపాధ్యాయులు శృతిని అభినందించారు.

నిధులు రాక ఇబ్బందులు పడుతున్నాం..

▸▸ గ్రామసభలో సర్పంచ్ చల్లా ఉమాదేవి



మాట్లాడుతున్న సర్పంచ్ చల్లా ఉమాదేవి

స్టేషన్‌ఘన్‌పూర్, జనవరి 27 : ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని వినియోగించుకొని గ్రామాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేయడంలో భాగంగా రూ.40 లక్షల మేర స్వంత నిధులు వెచ్చించి పనులు చేసినప్పటికి బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్నామని తాటికొండ సర్పంచ్ చల్లా ఉమాదేవి సుధీర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలోని జీపీ కార్యాలయంలో శనివారం గ్రామసభ జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ఐదేళ్లుగా ప్రజలు అందించిన సహకారం మరువలేనిదన్నారు. ప్రజలు సమన్వయంతో సమస్యలను తమ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకున్నారని తెలిపారు. 2024-25 సంవత్సరానికి గాను కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే 15వ ఆర్థిక సంఘం నిధులతో ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులను చేబట్టనున్నట్లు పేర్కొన్నారు. గ్రామంలో పారిశుధ్య పనులు, వీధి దీపాలను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డి, ఉప సర్పంచ్ మారపాక రాములు, చల్లా నర్సింహరెడ్డి, మారపాక పద్మ-నాగరాజు, రమ, ఎల్లయ్య లక్ష్మీ, రేణుక, దామెర ఉపేంద్ర, రాజయ్య, లావణ్య, బేతి మంజుల, సెక్రటరి జెల్లల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అన్యాక్రాంతమైన భూములను కాపాడాలి

▸▸ సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జువారి రమేశ్



ప్రభుత్వ భూమిని సందర్శించి మాట్లాడుతున్న జువారి రమేశ్

జఫర్‌గడ్, జనవరి 27: మండలంలో అధికారుల నిర్లక్ష్యం మూలంగా ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవుతున్నాయని, వాటి పరిరక్షణకు తక్షణ చర్యలు కోవాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జువారి రమేశ్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన స్థానిక రైతులతో కలిసి మండలంలోని కోనాయిచలం శివారు సర్వే నంబరు 161/సి/2లోని ప్రభుత్వ భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ ఈ సర్వే నంబరులో మొత్తం 26 ఎకరాల 22 గుంటలు ప్రభుత్వ భూమి ఉందన్నారు. ఈ భూమిలో సీపీఐ ఆధ్వర్యంలో గిరిజన పేదలచే ఎర్రజెండాలు పాతి గుడిసెలు వేయించి భూపోరాటం చేశామన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ ఆధీనంలో ఉన్న ఆ భూమిలో కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు వరద కాలువ మట్టిని పోసి, చిన్నచిన్న కుంటలు చేసి అక్రమంగా ఆక్రమించేందుకు యత్నిస్తున్నారన్నారు. సంబంధిత రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. అధికారులు, నేతల అండదండలతోనే అక్రమార్కులు ప్రభుత్వ భూముల హద్దులను చెరిపేసి ఆక్రమించేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. అధికారులు వెంటనే స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకుని, ప్రభుత్వ భూములను కాపాడాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిచో గుడిసెలు వేయించి పేదలకు పంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, గిరిజనులు అజ్మీర శ్రీను, రాములు, రెడ్యా, యాకూబ్, బానోత్ రెడ్యా దస్రూ, బాలాజీ, శ్రీకాంత్, రూప్లానాయక్, జోగు ప్రభాకర్ పాల్గొన్నారు.

గురుకులంలో ప్రవేశానికై దరఖాస్తు చేసుకోండి

కొడకండ్ల, జనవరి 27: మండల కేంద్రంలోని టీఎస్ఆర్ఎస్ గురుకుల కళాశాలలో ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ తమ్మి దిలీప్ తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ రానున్న విద్యా సంవత్సరానికై ఇంటర్ మొదటి సంవత్సరం అడ్మిషన్ల కోసం ఈ నెల 31 నుంచి మార్చి 16 వరకు విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కొడకండ్లలోని టీఎస్ఆర్ఎస్ జనరల్ కళాశాలలో ఆంగ్ల మాధ్యమంలో ఎంపీసీ, బైపీసీ కోర్సులు అందుబాటులో ఉన్నాయని ఆయన పేర్కొన్నారు.

హక్యాతండా సర్పంచ్‌కు ఘన సన్మానం

కొడకండ్ల, జనవరి 27 : మండలంలోని హక్యాతండా సర్పంచ్ గుగులోత్ రాగ్యానాయక్ 5 సంవత్సరాల పదవీకాలం పూర్తి చేసుకుంటున్న సందర్భంగా గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో శనివారం గ్రామసభ నిర్వహించారు. అనంతరం వార్డుమెంబర్లను గ్రామస్థులు సన్మానించారు. ఈ సందర్భంగా రాగ్యానాయక్ మాట్లాడుతూ గత 5 ఏళ్ల కాలంలో సుమారు రూ.7 కోట్ల అభివృద్ధి పనులు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ భూక్యా జీజా, కార్యదర్శి, స్వరూప, వార్డుమెంబర్లు కె.భిక్షం, బాలాజీ, యాకు, పద్మ, శ్రీను, సుశీల, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గ్రామ కమిటీల ఎన్నిక

నర్మెట, జనవరి 27:మండలంలోని మల్కపేట, హన్మంతాపూర్, బొమ్మకూర్ గ్రామాల్లో కాంగ్రెస్ గ్రామ కమిటీలను శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మల్కపేట గ్రామ అధ్యక్షుడిగా లకావత్ లాలు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా బానోతు తిరుపతి, మహిళా అధ్యక్షురాలిగా తేజావత్ విజయ, హన్మంతాపూర్ గ్రామ అధ్యక్షుడిగా కాల్వ అశోక్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా మొగిలి ప్రవీణ్, మహిళా అధ్యక్షురాలిగా ఎదుకూరి కనకలక్ష్మి, బొమ్మకూర్ గ్రామ అధ్యక్షుడిగా పుప్పాల సత్యనారాయణ, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా అంగోతు శ్రీనివాస్, మహిళా అధ్యక్షురాలిగా అంగోతు సుజాతలు ఎన్నికయ్యారు. సమావేశంలో డీసీసీకార్యదర్శి గంగం నర్సింహరెడ్డి, మల్కపేట, హన్మంతాపూర్, బొమ్మకూరు గ్రామాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాల నివారణపై అవగాహన

దేవరుప్పుల, జనవరి 27 : విద్యుత్ వాడకం-ప్రమాదాల నివారణపై ఎన్‌పీడీసీఎల్ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని కామారెడ్డిగూడెం హైస్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన జనగామ జిల్లా విద్యుత్ అవగాహన కోఆర్డినేటర్ భూక్యా బాలు మాట్లాడుతూ విద్యుత్ పొదుపు చేయటంతో పాటు ప్రమాదాల నివారణపై తీసుకునే చర్యలపై వివరించారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో లైన్‌మెన్ శ్రీధర్‌రెడ్డి, హెడ్మాస్టర్ లక్ష్మణ్‌జీ, ఉపాధ్యాయులు రజనీదేవి, నిహారిక, చంద్రకళ, క్రిష్ణ, హరి తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు కడియం ఫౌండేషన్ చేయూత

▸▸ ఫౌండేషన్ చైర్ పర్సన్ కడియం కావ్య



తీగారం పీఎస్ విద్యార్థులకు నోటు బుక్కులను అందిస్తున్న డాక్టర్ కావ్య

జఫర్‌గడ్, జనవరి 27 : నిరుపేద విద్యార్థులు, అనాథ పిల్లలు, మానసిక వికలాంగుల చదువు, ఎదుగుదలకు కడియం ఫౌండేషన్ చేయూత నందిస్తోందని ఆ సంస్థ చైర్‌పర్సన్ డాక్టర్ కడియం కావ్య అన్నారు. శనివారం ఆమె మండలంలోని తీగారం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన వంద మంది బాలబాలికలకు ఉచితంగా నోటు బుక్కులు, పెన్నులు తదితర సామగ్రిని స్థానిక ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయుల సమక్షంలో అందజేశారు. ఈ సందర్భంగా కావ్య మాట్లాడుతూ మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాల కనుగుణంగా ఫౌండేషన్ సేవా కార్యక్రమాలను చేపడుతూ పేదలకు అండగా నిలుస్తోందన్నారు. విద్యార్థులు సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని చక్కగా చదువుకుని ఉన్నత స్థితికి చేరుకోవాలని ఉద్బోధించారు. కార్యక్రమంలో సర్పంచ్ గోనె జయపాల్‌రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.శ్రీనివాస్, ఎస్ఎంసీ చైర్మన్ నాగరాజు, ఉపాధ్యాయులు పిట్టల మహేందర్, రాధారాణి, వార్డు సభ్యులు, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.